న్యూస్ బాక్స్


కలెక్టరేట్ ఆవరణలో ఉచిత భోజనం

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ప్రతీ సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల కోసం భోజన వసతి కల్పించినట్లు లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ కావేటి రాజగోపాల్ తెలిపారు. ప్రతీ సోమవారం 200 మంది వరకు భోజనం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో నిత్యాన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన తాడూరి శ్రీమన్నారాయణ

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ మంగళవారం మంత్రి నివాసంలో కలిశారు. కుల గణన కోసం డెడికేషన్ కమిషన్ వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం బీసీ వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపిందని మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు తీసుకున్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణనతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల వాటాపై న్యాయపరమైన చిక్కులు రాకూడదని డెడికేషన్ కమిషన్‌తో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఆరో తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే రాజకీయ ఆర్థిక, విద్య, సామాజిక విశ్లేషణలతో జరుగుతుందని ప్రజలంతా సహకరించాలని కోరారు. కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాహుల్ గాంధీకి మంగళవారం వివరించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

- పరిధి విస్తరించడంతో పెరిగిన ప్రాధాన్యం
- పోటీపడుతున్న మూడు నియోజకవర్గాల నాయకులు
- మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సుల కోసం యత్నాలు



రుడా చైర్మన్ పదవిపై ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాకు కొత్తగా మంజూరైన రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(రుడా) చైర్మన్ పదవిపై పలువురు నాయకులు ఆశలు పెంచుకున్నారు. ఈ పదవిని దక్కించుకునేందుకు సదరు నాయకులు తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచడంతో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మొదట రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కే పరిమితం అవుతుందనుకున్నా, దాదాపుగా జిల్లా అంత విస్తరించడంతో చైర్మన్, డైరెక్టర్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది.

గత ప్రభుత్వ హయాంలో ఆయా జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలను ఏర్పాటు చేసింది. గ్రామాలను కూడా పట్టణాల వలే తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు జిల్లాల్లో కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ ఆథానిటీలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీలతో పాటు గ్రామాలను కూడా విలీనం చేసింది. పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలను పెంచింది. అందులో భాగంగా జిల్లాకు రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ మంజూరు చేసింది. ఇందులో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు 198 గ్రామాలతో ఏర్పాటు చేశారు. జిల్లాలో 267 గ్రామ పంచాయతీలు ఉండగా 75 శాతానికి పైగా రుడాలో కలిపారు. అలాగే వివిధ జిల్లాల్లో ఉన్న పాత అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీల పరిధిని విస్తరించింది. మొదట రామగుండం కార్పొరేషన్‌ను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులను కోరుతూ వస్తున్నారు. దీంతో స్పందించిన ప్రభుత్వం రుడా మంజూరు చేసింది. అందరూ ఊహించినట్లుగా గాకుండా దీని పరిధి ఒక్క రామగుండం కార్పొరేషనే గాకుండా పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతో పాటు 198 గ్రామాలను కలుపుతూ రుడాను ప్రకటించారు. దీంతో రుడాకు బదులు పెద్దపల్లి కేంద్రంగా పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(పుడా) ఏర్పాటు చేయాలని, లేదంటే రామగిరి పేరు పెట్టాలనే వాదనలను కాంగ్రెస్ సహా బీఆర్ఎస్, బీజేపీ, ఇతరపక్షాలు సైతం వినిపిస్తున్నాయి. పేరుమార్చాలని పెద్దపల్లికి చెందిన నాయకులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాలు కూడా ఇచ్చారు. పుడా ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేశారు. రామగుండం నియోజకవర్గ పరిధి 80 శాతానికి పైగా జిల్లా విస్తరించి ఉండడంతో దాని ప్రాధాన్యం మరింత పెరిగింది. రుడా చైర్మన్, డైరెక్టర్ పదవులపై రామగుండంతో పాటు పెద్దపల్లి, మంథని, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు సైతం ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతానికి జిల్లా

మిగతా 8వ పేజీలో...

● ఎందుకింత పోటీ?

రియల్ ఎస్టేట్ లే అవుట్లు, పరిశ్రమల భవనాలు, ఇతరత్రా నిర్మాణాలకు రుడా నుంచే అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి కూడా మౌలిక వసతుల కల్పనకు నిధులు కూడా బాగానే వచ్చే అవకాశం ఉంది. అంతేగాకుండా జిల్లాలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ కలిగి ఉండడం, ప్రత్యేక కారు, అలవెన్సుల సౌకర్యం ఉండడంతో ఎలాగైనా రుడా చైర్మన్ పదవిని దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. జిల్లాలో ఎక్కడ నలుగురు గుమిగూడినా రుడా చైర్మన్ ఎవరు అవుతారనే చర్చ జరుగుతున్నది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంతం అన్నయ్య గౌడ్‌కు ఇవ్వడంతో రుడా చైర్మన్ పదవి మంథని, రామగుండం నియోజవర్గాల్లోని నాయకులకు ఎవరికైనా దక్కవచ్చని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్నది. కానీ పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు సైతం పట్టు విడవకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సూచించిన వారికే రుడా చైర్మన్ పదవి దక్కవచ్చని తెలుస్తున్నది.

ధాన్యం తూకంలో తేడా వస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో తేడాలు రాకుండా చూసుకోవాలని అలా వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి గ్రామాలల్లో ఐకేపీ, సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, బండారి రమేష్, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, కల్లెపల్లి జానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- షీ టీం సభ్యురాలు స్నేహలత



అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులతో షీ టీం సభ్యులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీ టీం సభ్యురాలు స్నేహలత అన్నారు. సోమవారం మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో షీ టీం పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యురాలు స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం నిత్యం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీం పనిచేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 కాల్ చేసి వివరాలు తెలపాలని సూచించారు. ప్రస్తుతం లక్కీ డ్రా పేరుతో వస్తున్న మెసేజ్‌లు, ఫోన్ కాల్ మాయలో పడి అత్యాశకు పోయి సైబర్ క్రైం ఆన్‌లైన్ మోసాలకు గురైతే, సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930కి సమాచారం అందించాలన్నారు. మహిళలకు ప్రమాదం ఉన్నట్లయితే , బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల అధికారుల నియామకం



క్యాతం వెంకటరమణకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా రిటర్నింగ్ సహాయ అధికారిగా గోదావరిఖనికి చెందిన క్యాతం వెంకటరమణను నియమిస్తూ సోమవారం బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా రిటర్నింగ్ అధికారిగా అయ్యన్నగారి భూమన్న, సహాయ కార్యదర్శిగా పొలసాని సంపత్‌రావులను నియమించింది. ఈ సందర్భంగా క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ 2019లో తెలంగాణలో 11.7లక్షల మంది సాధారణ సభ్యులుగా చేరితే 2024లో ఇప్పటి వరకు 31.22లక్షల మంది బీజేపీలో చేరారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన పట్ల ప్రజలకు ఎనలేని విశ్వాసం పెరిగిందని, అన్నీ రంగాల్లో దేశం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

నేడు మంథనికి అయోధ్య రామయంత్ర రథయాత్ర

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోప్రతిష్ఠించబోయే రామయంత్ర రథయాత్ర మంగళవారం మంథనికి రానున్నట్లు కో-ఆర్డినేటర్ బొబ్బిలి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగద్గురు కంచి పీఠాధిపతులు ఆజ్ఞ మేరకు కంచి నుంచి ఆయోధ్య వరకు 150 కిలోల బంగారు పూతతో తయారు చేసిన రామయంత్ర రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా మంథనికి సాయంత్రం ఐదు గంటలకు స్థానిక గాంధీచౌక్ నుంచి శోభయాత్ర ప్రారంభమవుతుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.



నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ భవనం

మెడికల్ హబ్‌గా రామగుండం

- కళాశాలకు అనుబంధంగా త్వరలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు

8



వర్క్‌షాప్‌కు

పాఠశాలల సమర్థ నిర్వహణపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఎన్టీపీసీలో వర్క్‌షాప్ నిర్వహణ

8

మొండి బకాయిదారులపై కార్పొరేషన్ కొరడా

రెవెన్యూ యాక్ట్ ప్రయోగంతో మొండి బకాయిల వసూలు



తహసీల్దార్‌కు ఆస్తిపన్ను చెల్లిస్తున్న సదానంద థియేటర్ నిర్వాహకులు

కోల్‌సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించారు. ఆయన ఆదేశాల మేరకు రామగుండం నగర కమిషనర్ తహసీల్దార్‌కు లేఖ రాశా రు. ఈ లేఖను అనుసరిస్తున్న రామగుండం తహసీల్దార్ కుమారస్వామి పది మంది మొండి బకాయిదారులకు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆస్తులను వేలం వేస్తామని నోటీసులు ఇచ్చారు. 10మంది బకాయిదారులే కార్పొరేషన్‌కు రూ.1.6కోట్లు బాకీ పడ్డారు. దీంతో బకాయిల వసూళ్లను సీరియస్‌గా తీసుకున్నారు. కవిత థియేటర్ యాజమాన్యం కోర్టుకు వెళ్లగా తహసీల్దార్ కౌంటర్ దాఖలు చేయడంతో స్టే దొరకలేదు. అనివార్యమైన పరిస్థితుల్లో బకాయిదారులు పన్ను చెల్లింపునకు దారికి వస్తున్నారు. ఇటీవల సింధుర కళాశాల యాజమాన్యం రూ.20.6లక్షల ఆస్తిపన్ను బకాయిలను చెల్లించింది. సోమవారం సదానంద థియేటర్ యాజమాన్యం రామగుండం తహసీల్దార్ కుమారస్వామి సమక్షంలో రూ.3.74లక్షలు పన్ను చెల్లించింది. మరో ఇద్దరు ముగ్గురు బకాయిదారులు ఆస్తిపన్ను చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కాగా బకాయిలు చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను వేలం వేసేందుకు కూడా రామగుండం తహసీల్దార్ రంగం సిద్ధం చేశారు. రూ.34.48లక్షలు, లోటల్ ఎంబీఏ కాలేజీ రూ.14.6లక్షలు, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, గురువారెడ్డి అనే వ్యక్తులు రూ.24.7లక్షలు, వీరాంజనేయ ఇండస్ట్రీస్ రూ.18.4లక్షలు, ఫణి జూనియర్ కళాశాల రూ.9లక్షలు, మొక్క నర్సింహారెడ్డి రూ.25.43లక్షలు, శివారెడ్డి రూ.11.67లక్షలు, కాసరి పాపయ్య రూ.2.58లక్షలు ఆస్థి పన్ను చెల్లించాలని తహసీల్దార్ పేర్కొన్నారు. వీరు త్వరగా ఆస్తిపన్ను చెల్లించకపోతే ఆస్థుల వేలం నిర్వహిస్తామని చెప్పారు. బకాయిదారుల ఆస్తుల విలువ కోట్లలో ఉంటుంది. మార్కెట్‌లో వేలం పెడితే దక్కించుకునేందుకు కూడా పోటీ ఉండే అవకాశం ఉంది. మరో ఎనిమిది మంది రామగుండం కార్పొరేషన్‌కు ఆస్తిపన్ను బకాయిలు ఉన్నారని, వారికి కూడా నోటీసులు జారీ చేసినట్టు తహసీల్దార్ చెప్పారు. ఆస్తిపన్ను చెల్లించని పక్షంలో రెవెన్యూ శాఖ ద్వారా స్వాధీనం చేసుకుని వేలం ద్వారా బకాయిలు వసూలు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కవిత థియేటర్

కేకులో మేకు



ధర్మారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంతోషంతో పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేసి కుమారుడికి తినిపించిన తల్లిదండ్రులకు ఊహించని షాక్ తగిలింది. కేక్ తిన్న బాలుడు కొద్దిసేపటికే వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ధర్మారం మండలం కటికెనపల్లికి చెందిన బైరు కరుణాకర్ కుమారుడు అయాన్ష్ రెండో పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ధర్మారం మండల కేంద్రంలోని ఓ బేకరీలో కేక్ తీసుకున్నారు. ఇంటికి వెళ్లి కేక్ కట్ చేసిన తల్లిదండ్రులు సంతోషంతో బాబుకు తినిపించారు. కేక్ తిన్న బాలుడు కొద్ది సేపటికే వాంతులు చేసుకున్నాడు. దీంతో అయాన్ష్ తల్లిదండ్రులు ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యారు. అనంతరం పరిశీలించగా కేకులో మేకు బయట పడింది. స్థానిక ఆర్‌ఎంపీని సంప్రదించగా అపాయం లేదని తెలిపడంతో బాలుడి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ఓదెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక యూపీఎస్ పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ నంద క్రాంతి కుమార్ రూ. పదివేల విలువైన సౌండ్ సిస్టంను సోమవారం వితరణ చేశారు. తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యం కోసం సౌండ్ సిస్టంను అందించి తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉండి అవసరమైన వస్తువులను, సౌకర్యాలను అందజేసేందుకు అండగా ఉంటానని క్రాంతి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్ రెడ్డి, అంబటి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు సిద్దయ్య, రమాదేవి, సుహాసిని, షబాన తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన వేద విద్యార్థులు

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వేద పండితుడు వొజ్జల గణేష్ శర్మ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన వేద విద్వన్మహా సభల్లో మంత్రకూట సీతారామ గౌతమేశ్వర వేద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. దీంతో స్థానిక సీతారామ సేవా సదన్‌లో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. వేద పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభతో ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు సాధించడంపై సదన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి దుద్దిళ్ళ గణపతి, సంయుక్త కార్యదర్శి ప్రహ్లాద్, కోశాధికారి అంబరీష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి



ధర్మారంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

ధర్మారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ధర్మారం మండలంలోని దొంగతుర్తి, ధర్మారం, మల్లాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ధాన్యన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, అధికారులు ధాన్యాన్ని మద్దతు ధరపై వేగవంతంగా కొనుగోలు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోతల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నా రు. పంట కోసే సమయంలో హార్వేస్టర్ల వినియోగం, వాటి జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు, గోదాములకు ధాన్యాన్ని తరలించాలని, ఇందుకోసం వాహనాల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులేదని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, తహసీల్దార్ మహ్మద్ ఆరీఫ్ ఉద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, ప్యాక్స్ చైర్మెన్ నోముల నర్సింహారెడ్డి, ధర్మారం మండల వ్యవసాయ అధికారి బండ రాజు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డి వేణు

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి వేణు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజేశ్వరరావు సర్వే నంబర్ 331 బిసిలో సుమారు నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నానని, మానేరు చెక్ డ్యాం వల్ల తన పొలంలోకి నీళ్లు వస్తున్నాయని, తన భూమికి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం ఇప్పించి తగిన న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. పెద్దపల్లి నీటిపారుదలశాఖ ఈఈ రాస్తా పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లికి చెందిన బర్ల లక్ష్మి తమ డివిజన్లో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు రాస్తా అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి మున్సిపాలిటీ టీచర్ల కాలనీకి చెందిన ఈర్ల సంపత్ పెద్దపల్లి మార్కెట్ వెనక నూతనంగా నిర్మిస్తున్న మురికి కాలువకు ప్రధాన కాలువ అనుసంధానం చేయకుండా నేరుగా తన ఇంటి ఎదురుగా వచ్చే విధంగా పనులు ప్రారంభించారని, ప్రధాన కాలువకు కలిసే విధంగా నిర్మించాలని కోరాడు. అవసరమైన చర్యలు చేపట్టాలని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రావ్యశ్రీ

ఓదెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ హైస్కూల్లో తొమ్మిదోతరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో శ్రావ్యశ్రీ షాట్ పుట్‌లో ఉత్తమప్రతిభను కనబరిచి ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థాయిలో నిలిచింది. దీంతో అండర్17 విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఎంపిక అవ్వడం పట్ల పూర్వవిద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు యేసుదాసు, ఉపాధ్యాయులు, పీఈటీలు పోరెల్ల సదయ్య, తాండ్ర ప్రణయ్ విద్యార్థిని అభినందించారు.

అగ్నిప్రమాదం



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఓఇంట్లో సోమవారం సాయంత్రం ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన జల అనే వివాహిత ఇంట్లో దీపం పెట్టి బయటకి వెళ్లింది. కొద్ది సేపటికి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న 10 వేల నగదు, ఒక బీరువా కాలి బూడిదైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.





మహాబావి

● ఆసియా ఖండంలోనే అతిపెద్దది ● ఒక టీఎంసీ నిలువ సామర్థ్యం


● 92 మీటర్ల లోతు.. 56 మీటర్ల వ్యాసం

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామ సమీపంలో నిర్మించిన మహాబావి ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు లోని నాలుగో లింక్ ద్వారా 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామ సమీపంలో అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించే ప్రదేశం ఎత్తుగా ఉండడంతో నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో తిప్పాపూర్ సమీపంలో సర్జిపూల్ నిర్మాణ పనులు చేపట్టింది. 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వ్యాసంతో మహాబావి నిర్మాణం ప్రారంభించారు. రికార్డు స్థాయిలో 13 నెలల్లో పూర్తి చేశారు. ప్రతీ రోజు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించారు. 3.4 కిలో మీటర్లు కాలువల ద్వారా, 7.6 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా మిడ్ మానేరు నుంచి నీటిని తరలిస్తారు. సర్జిపూల్‌లోని నీటిని ఎత్తిపోయడానికి అండర్ పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పంప్‌హౌస్‌లో నాలుగు భారీ పంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో మోటారు రోజుకు 2,800 క్యూసెక్కుల నీటిని సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుంటాయి.

పంపులు నడవడానికి అవసరమైన విద్యుత్ కోసం సమీపంలోనే 440 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అండర్ పంప్‌హౌస్‌లోకి తొలుత ఇతరులను ప్రవేశం లేకపోయినా ప్రస్తుతం పర్యాటకులను అనుమతిస్తున్నారు.







అన్నపూర్ణ రిజర్వాయర్, అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్

జాతీయస్థాయి కరాటే పోటీలకు 'ఖని' విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌కు గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో శ్రీవర్షిని, ఎం.ముక్తిశ్రీ, బి.సహస్ర, సృష్టి, పి.సహస్ర ప్రతిభ కనపర్చి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జపాన్ షిటోరియో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థును జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం రమేష్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ కె శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, కె శ్రావణ్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అబిజ్ఞ, శివశ్రీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బానేష్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ వీరవిహార్ అభినందించారు.



పతకాలతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

క్రైం కార్నర్

పురుగుల మందు తాగిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యా ల గ్రామానికి చెందిన పంది మధుకర్(30) అనే యువకుడు పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పంది మధుకర్ నిత్యం మద్యం తాగుతూ ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం తాగవద్దని వారించిన అతడి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో అక్టోబరు 30న తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమ నించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మధుకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

ఇల్లందకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన దుండ్ర లత (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందింది. లత భర్త కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చిట్యాల సమ్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిట్యాలకు చెందిన సమ్మయ్య కొయ్యూరు నుంచి నాగెపల్లి గ్రామానికి తన బంధువుల ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి మండలం నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సమ్మయ్య భార్య చిట్యాల సుగుణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

సిరిసిల్ల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణం జిల్లా ఆసుపత్రి మార్చురీ వద్ద 55ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఆసుపత్రి సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి నీలిరంగు షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై పుట్టు మచ్చ కలిగి ఉన్నాడు. మృత దేహాన్ని మార్చురీ గదిలో భద్ర పరిచామని, సంబంధీకులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేల్పుల సంజీవ్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పది రోజుల క్రితం సంజీవ్ సిరిసిల్ల చెందిన రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. జిల్లెల్ల-రామచంద్రపూర్ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సంజీవ్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. రమేష్ పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కుడు వాని పల్లె గ్రామానికి చెందిన బోయిని నరసయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చిక్కుడువాని పల్లెకు చెందిన నర్సయ్య ద్విచక్ర వాహనంపై పెద్ద లింగాపూర్ గ్రామానికి వస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలవడంతో వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్‌ను చూపుతున్న బాధితుడు

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో తొమ్మిది ట్రాక్టర్ల బ్యాటరీలు, 18 ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ల బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగిలించారు. సోమవారం ఉదయం ట్రాక్టర్లను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ట్రాక్టర్‌ను పరిశీలించగా బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు సుమారు ఎనిమిది వేలు, ఒక్కో హైడ్రాలిక్ పట్టి ఖరీదు రెడువేల రూపాయల వరకు ఉంటుందని బాధితులు వారి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● అవయవదానం చేసిన తల్లిదండ్రులు



మాదాసి సాయి నితీష్ (ఫైల్)

కళ్యాణ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కుమారుడి బ్రెయిన్ డెడ్ అయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు. అక్టో బరు 24న మాతంగి కాలనీవద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన మాదాసి సాయినితీష్ (23) తీవ్రంగా గాయపడ్డాడు. చావు బతుకుల మధ్య పోరాటం చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణించాడు. నితీష్ తల్లిదండ్రులు గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్లను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేయగా యశోద ఆసు పత్రిలోని సిబ్బంది నితీష్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మల్లేష్, ఉమ మాట్లాడుతూ తమ కుమారుడు బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినా అవయవదానం చేసి ఇతరులకు ప్రాణం పోశాడన్నారు.

●రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమేష్ నగర్‌కు చెందిన మాదాసి సాయి నితీష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. వారి తల్లిదండ్రులను ఓదార్చారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వీసీ అభినందన



శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హిమాచల్ ప్రదేశ్‌లో జాతీయ సాహస శిబిరంలో పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అభినందించారు. పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతిని వీసీతో పాటు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మనోహర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ అర్జున్, డాక్టర్ వి రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్‌లు అభినందించారు.

సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ఈ నెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో సేవాదళ్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సేవాదళ్ కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షులు కాసారపు ఎల్లయ్యగౌడ్, నగర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు, వివిధ మండాలల అధ్యక్షులు, నాయకులు కుమారస్వామి, భద్రేశం, గర్రెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రెండున్నర సంవత్సరాల బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుల కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 27న కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్ రేనా తన రెండున్నర సంవత్సరాల కుమారుడిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్ఐ రాజన్న, కానిస్టేబుల్స్ కుమార్, బషీర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పారు చేశారు. బాలుడి అచూకీ కోసం గాలించిన ప్రత్యేక టీం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ బాలుడిని తల్లి వద్ద నుంచి అపహరించారు. ఆ బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేష్ దంపతులకు 50 వేల వేలుకు అమ్మారు. దర్యాప్తులో ఈ విషయాలను గుర్తించిన పోలీసులు నిందితులైన దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారు. మరో నిందితుడు మోతె కృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



వేంపేట శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని గ్రామంలో సేకరించిన వాటిని అక్రమంగా తరలిస్తునారని వచ్చిన సమాచారంతో ఎస్సై-2 రాజుతో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి వెళ్తున్న టీఎస్01యూసీ5721 నంబర్ గల ఆటోను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 22కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఎండీ హైదర్ అను ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని ఖానాపూర్ మండలానికి తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ అదేశాల మేరకు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై చర్యల నిమిత్తం మెట్‌పల్లి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



పుట్టల వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

నేడు నాగుల చవితి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగోపాసన, సర్పపూజ అనాదిగా వస్తున్న ఆచారం. నాగజాతి విష్ణువుకు తలగడగా, గొడుగుగా, ఆసనంగా, పాదుకలుగా, శివునకు అలంకారంగా, గణపతికి యజ్ఞోపవీతంగా ఉన్నట్లు పురాణ కథలున్నాయి. నాగులను కుండలినీ శక్తిగా భావించి ఆరాధిస్తారు. ఈ దిశలో కార్తీక శుక్ల చతుర్థి నాగులు ఆవిర్భవించిన నాగుల చవితిని మంగళవారం జరుపుకోనున్నారు. ఉపవాసాలు పాటిస్తూ పుట్టల్లో పాలు పోసి, పాలు, నెయ్యి కలిపిన నువ్వులు, బియ్యపు ముద్దలను నైవేద్యంగా పెడతారు. సర్పసూక్తం, అనంత నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరస్తుతులతో అభిషేక, అర్చనాదులు చేసి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలక ధారణ చేసుకుంటారు.

రంగు మార్చే రాశిగుట్ట



పసుపు వర్ణంలో చేతులు



బలపం రాళ్లు



రాశిగుట్టపై ఆంజనేయస్వామి దేవాలయం

- గుట్టపై లెటరైట్ శిలలు
- వాతావరణ మార్పులతో పుసుపు రంగు ధూళి

అటవీప్రాంతంలో ఉన్న ఆ గుట్టకు ప్రత్యేకత ఉంది. గుట్టపైకి వెళ్లే సరికి చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారిపోతాయి. గుట్టపై లెటరైట్ శిలలు ఉన్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఇలా జరుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో రాశిగుట్టకు సంబంధించి మరిన్ని విశేషాలు..

వీర్నపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల శివారు లోని అటవీప్రాంతంలో రాశిగుట్ట ఉంది. ఈ కొండ పైనే వెలిసిన అంజనేయస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వెళ్తుంటారు. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చేతులు, కాళ్లు పసుపు రంగులోకి మారి పోతుండడాన్ని భక్తులు గమనించారు. రాశిగుట్ట విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, పరిశోధకుల బృందం ఇటీవల రాశిగుట్టను సందర్శించింది. బృందం వెల్లడించిన వివరాల ప్రకారం.. గుట్టపై భాగాన లెటరైట్ శిలలు ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాపాతం ఉన్న ప్రాం తాల్లో ఇవి ఏర్పడతాయి. ఈ శిలలు వాతావర ణానికి ఆక్సీకరణం చెంది గుల్లలు గుల్లలుగా స్పాంజి వలే తయారవుతాయి. జాజు, పసుపు రంగు లేదా నారింజ రంగును సంతరించుకుంటాయి. ఈ క్రమంలో గుట్టపై పసుపు రంగు ఉన్న ధూళి గాలిలోకి చెట్లపైనా, రాళ్లపైనా చేరుతుంది. భక్తులు వాటిని తాకిన సందర్భంలో చేతులకు, గుట్ట ఎక్కుతుండగా పాదాలు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి.

వాతావరణ మార్పులతో పసుపు వర్ణం

రత్నాకర్‌రెడ్డి, చరిత్ర పరిశోధకుడు

వాతావరణ మార్పులతోనే రాశిగుట్టపై ఉన్న శిలల నుంచి వచ్చే పసుపు రంగు ధూళిలో కలు స్తోంది. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చెట్లు, రాళ్లను తాకినప్పుడు భక్తుల చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. ప్రభుత్వం రాశిగుట్టను ఏకో టూరిజం కింద అభివృద్ధి చేయాలి. రాశిగుట్టకు వెళ్లే దారి చూపే గుర్తులు ఏర్పాటు చేయాలి.



రాసిగుట్ట ప్రాంతం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ



ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్‌లో వరంగల్ జట్టుతో తలపడి ద్వితీయ స్థానం సాధించి నట్లు తెలం గాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్ధన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొం డ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, అమర్, సాయికృష్ణ, దుర్గరాజ్, సురేం దర్, కృష్ణహరి, తదితరులు అభినందించారు.

ఓయూ రిజిస్ట్రార్‌గా రేగడిమద్దికుంట వాసి



గడ్డం నరేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న వైస్ ఛాన్సలర్ కుమార్

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ రిజి స్ట్రార్‌గా సుల్తానా బాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన గడ్డం నరేష్ నియమితలయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌గా నియమితులైన గడ్డం నరేష్‌కు సోమవారం యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. సుల్తానాబాద్ మండంలోని రేగడి మద్దికుంట వాసి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులు కావడంపై గ్రామస్థులు, నరేష్ చిన్ననాటి స్నేహితులు పల్లా వాసు, మంద శ్రీనివాస్, కొమురెవల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్య విధానం అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. విద్యా శాఖ సీఎం వద్దే ఉంచుకొని కనీసం ఇంత వరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన మాటలకు నేడు ముఖ్యమంత్రిగా చేస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. పది సంవత్సరాల కాలంలో గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. వారి వైఖరి కారణంగా విద్యార్థి, యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పని చేశారన్నారు ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక, చాల పాఠశాలలు మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. సాంఘిక, సం క్షేమ, గురుకులాల ఉన్న విద్యార్థులు సమస్యలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీవర్ధన్, అభిరామ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

కరీంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గాలకు చెందిన వారు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నియోజకవర్గాలకు పదవీ కాలం 2025 మార్చి 29వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆన్‌లైన్, ఏఈఆర్టీ కార్యాలయాల్లో నేరుగా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు తెలియజేయ వచ్చన్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయ ఎన్నికల కోసం ఫారం-19లో దరఖాస్తు చేసుకో వాలని కలెక్టర్ సూచించారు.

108లో ఉద్యోగ అవకాశాలు

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో గల 108 వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా మేనేజర్ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బీ- ఫార్మసీ, ఎం-ఫార్మసీ లేక ఇంటర్మీడి యట్‌లో బైపీసీ లేదా ఏదేని మెడికల్ డిప్లొమా చేసినవారు, 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 6న జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9100799257 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక శోభ



కోటిలింగాల, ధర్మపురిలో గోదావరి వద్ద హారతి





ధర్మపురిలో గోదావరి నదిలో దీపాలు వదిలి పెట్టుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామితోపాటు అనుబంధ పరివార దేవతలకు అర్చనలు, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

రాజన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఈవో వినోద్‌రెడ్డి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లత బృదంతో ఏర్పాటు చేసిన భక్తి విభావరి గానం ఆకట్టుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కళాకారులను సన్మానించారు.

ఘనంగా మహాలింగార్చన

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి హారతినిచ్చారు. ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కార్తీక మాసంలో పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయంలో భక్తులు ఓం, స్వస్తిక్ ఆకారంలో ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి తిలకించారు.

ధర్మపురిలో కార్తీక సందడి

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వర స్వామి, అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.

మూడో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి మూడవ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమం నిర్వహించారు.





భక్తజనంతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ

అరుణాచల గిరి దర్శనానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణచల గిరి దర్శనానికి మంథని ప్రాంతం నుంచి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డీఎం శ్రావణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి అరుణాచలం గిరికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు సదుపాయాన్ని కల్పించామన్నారు. వెళ్లేటప్పుడు దారిలో ఉన్న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం, తిరుగు ప్రయాణంలో అలంపూర్ జోగులాంబ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. ఈనెల 16న రాత్రి 12 గంటలకు బస్సు గోదావరిఖని చేరుకుంటుందన్నారు.ప్రయాణానికి పెద్దలకు రూ.4850, పిల్లలకు రూ. 4000 చార్జీ అవుతుందన్నారు. అసక్తి కలిగిన భక్తులు ఆర్. మెండయ్య సెల్ నంబర్ 9949531412ను సంప్రదించాలని సూచించారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును నడిపిస్తున్నట్టు ఖని ఆర్టీసీ డిపో డీఎం నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 13న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.4800 చార్జి నిర్ణయించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 7382847316, 7382847427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఖని'లో నేడు దాశరథి, జాషువా సాహిత్య సభ

హాజరుకానున్న దేశపతి, కోటేశ్వరరావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గోదావరిఖని మార్కండేయకాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో దాశరధి, గుర్రం జాషువాల సాహిత్య సదస్సు జరుగనుంది. ఈ మేరకు చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు ఎం.విజయానంద్ ఒక ప్రటనలో తెలిపారు. సాహిత్య సభకు ఎమ్మెల్సీ, గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సీటీ కళాశాల తెలుగు విభాగం డీన్ కోటేశ్వర్‌రావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. దాశరథి సాహిత్యంపై దేశపతి, గుర్రం జాషువా కవిత్వంపై కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. కాగా సాహిత్య సభకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సాహితీ అభిమానులు, తెలంగాణ వాదులు, సామాజిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌యూ ఫార్మసీ కళాశాలను పట్టించుకోరా..?



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల

- రేకుల షెడ్లలో హాస్టల్
- కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 103 మంది విద్యార్థులు ఉన్నారు. 1980లో ఫార్మసీ కళాశాలకు 42.14 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించారు. తర్వాత అందులో ఐదెకరాల భూమిని ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించారు. మిగతా 37.14 ఎకరాల యూనివర్సిటీ భూమి ఎంత కబ్జాకు గురైందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రహరీ నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాం సమీపంలో ఎస్సారెస్పీ క్వార్టర్స్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్లు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే హాస్టల్ గదులు ఊరుస్తుంటాయి. కళాశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళలో బయటకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం..

ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్



ఫార్మసీ కళాశాలలోని సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. రూ. 2.2 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి ప్రతి పాదనలు రూపొందించాం. ఈ ప్రతిపాదనలను యూనివర్సిటీ ఎగ్జిక్యూట్ కౌన్సిల్ ముందుంచి ఆమోదం తీసుకుంటాం. 2.8 కోట్లతో అదనంగా నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. హాస్టల్ భవనం నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నాం.



రేకుల షెడ్లలో హాస్టల్



నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

న్యూస్ బాక్స్

మేరపల్లిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం మేరపల్లిలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన దాడి సంతోష్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దాడి సంతోష్ మాట్లాడుతూ మేరపల్లిలో సుమారు 1500 జనాభా ఉందని, 300 లకు పైగా రేషన్ కార్డుదారులు ఉన్నారని తెలిపారు. గ్రామంలో రేషన్ దుకాణం లేని కారణంగా రైతులు, కూలీలు సరైనా సమయానికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సరుకులు తీసుకోలేక పోతున్నట్లు తెలిపారు. వెంటనే గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్, పంబాల చంద్రమౌళి, శేఖర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఇటీవల నియామకమైన అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన మినుపాల ప్రకాశరావు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుతో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్షను సోమవారం తన చంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావుకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం నెట్‌బాల్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్టు జిల్లా నెట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు సానా రామకృష్ణారెడ్డి, బుద్దుల తిరుపతియాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బాలబాలికల రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు జరుగుతాయిని వారు తెలిపారు.

మెడికల్ హబ్‌గా రామగుండం

- కళాశాలకు అనుబంధంగా త్వరలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు

- పది నెలల్లో ఐదు అంతస్థుల భవన నిర్మాణం పూర్తి



నిర్మాణంలో ఉన్న భవనం

కళ్యాణ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేరుపొందిన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఒకప్పుడు ఏ రోగం వచ్చినా కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వైద్యం కోసం వెళ్లేవారు. ఒక దశలో చాలా మంది ప్రాణాలు కూడా కోల్పోయిన సందర్భాలున్నాయి. పరిశ్రమలకు, దానిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది జీవనం కొనసాగిస్తున్నారు. రామగుండంలో సింగరేణి సంస్థ రూ.520కోట్లతో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్)ను ఏర్పాటు చేయడంతో ఇక్కడ వైద్య సేవలు పెరిగాయి. కళాశాలకు అనుబంధంగా 717 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 362 పడకలు అందుబాటులో ఉండగా రూ.142 కోట్లతో 355 పడకల ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మించారు. దీంతో పాటు రూ.16కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత మార్చి నెలలో 355 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా మొదటి స్లాబ్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. 2025 ఆగస్టు వరకు పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు మంత్రి, ఎమ్మెల్యే ఆదేశించడంతో పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయి. సిమ్స్ కళాశాల ఏర్పాటుతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో జనరల్ ఆసుపత్రికి రోగుల తాకిడి కూడా పెరిగింది. రోజుకు 1500 నుంచి 1600 ఓపీ సేవలు చేస్తున్నారు. ప్రొఫెసర్లు అందుబాటులో ఉండడంతో పాటు ఆసుపత్రిలో సౌకర్యాలు కూడా మెరుగు పడ్డాయి.

● కీళ్ల మార్పిడిలు విజయవంతం...

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 60ఏళ్లకు పైబడి ఇద్దరికి వైద్యులు కీళ్ల మార్పిడిని విజయవంతం చేయడంతో ఆర్థో విభాగానికి రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కీళ్ల మార్పిడి రూ.2లక్షల నుంచి రూ.5లక్షలు ఖర్చు అవుతుండడంతో సామాన్యులకు భారమవుతోంది. దీంతో ప్రభుత్వాసుపత్రుల్లో కీళ్ల మార్పిడికి కూడా వైద్యులు శ్రీకారం చుట్టారు.

● దంత విభాగంలో ఎముకల అమరిక..

దంత విభాగంలో నలుగురు వ్యక్తులకు ఎముకలు విరిగిపోగా వారిని సామాన్య స్థితికి తీసుకువచ్చారు. దంతాల అమరిక, విరిగి ఎముకలకు ఆపరేషన్లు నిర్వహించడంతో చాలా మంది ప్రభుత్వాసుపత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

త్వరలోనే నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు

మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. కాలేజీలను ఏర్పాటు చేయాలంటూ నెల రోజుల క్రితం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కళాశాల ఏర్పాటు పనులను త్వరలో ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ కూడా ఇచ్చారు. సెక్రర్డ్ హార్ట్ హైస్కూల్‌లోని తెలుగు మీడియం స్కూల్ భవనాన్ని నర్సింగ్ కాలేజీకి కేటాయించనున్నట్టు సమాచారం.

ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



రామగుండం నియోజకవర్గ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసి వైద్యుల సంఖ్య పెంచాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కోరాను. క్యాత్ ల్యాబ్ ఏర్పాటుతో పాటు నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు త్వరలోనే ప్రారం భిస్తాం. రామగుండాన్ని మెడికల్ హబ్‌గా మారుస్తాం.

పాఠశాలల సమర్థ నిర్వహణపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

జ్యోతినగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రధా నోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీపీసీలోని కాకతీయ ఆడిటోరియంలో జిల్లాలోని కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, మండల విద్యాధికారులు, నోడల్ అధికారులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ శ్రీహర్ష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించే దిశగా పాటించాల్సిన పద్ధతులు, టీఎల్ఎం విధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. పాఠశాలల్లో గుణాత్మక విద్యను మెరుగుపరచడానికి కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కలెక్టర్ తగిన సూచనలు చేశారు. రానున్న మూడు నెలల్లో 80 శాతం మంది విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి డి మాధవి, జిల్లా సమగ్ర శిక్షణ సమన్వయ కర్త పీఎం షేక్, అధికారులు పాల్గొన్నారు.

రుడా చైర్మన్ పదవిపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ చైర్మన్‌గా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు.

● ఒత్తిడి తీసుకువస్తున్న నేతలు..

రామగుండం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ నాయకులు గుమ్మడి కుమారస్వామి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ కొలిపాక సుజాత, టీపీసీసీ సభ్యుడు కాలువ లింగస్వామి, పాతుపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు, ఎం రాజిరెడ్డి, ధనుంజయ్, బయ్యపు మనోహర్ రెడ్డి, ఎం రవి కుమార్ పోటీ పడుతున్నారు.

మంథని నియోజకవర్గం నుంచి ముత్తారం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, శశిభూషణ్ కాచె, తొట్ల తిరుపతి యాదవ్, గంట వెంకటరమణారెడ్డి, తదితరులు, పెద్దపల్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, దన్నమనేని దామోదర్‌రావు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, బూషణవేని రమేష్‌గౌడ్, సయ్యద్ మస్రత్, తదితరులు రుడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై రుడా చైర్మన్ తనకే ఇప్పించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబును మంథని నియోజకవర్గానికి చెందిన నేతలే గాకుండా ఇతర నియోజకవర్గాలకు చెందిన కొంత మంది నాయకులు నేరుగా కలిసి ఆయన ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు.

పుడాగా పేరును ప్రతిపాదిస్తూ తీర్మానం చేయాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డికి వినతిపత్రం సభ్యులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)ను పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా)గా పేరును ప్రతిపాదిస్తూ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం ప్రవేశపెట్టాలని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డికి సోమవారం పుడా సాధన సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మమతారెడ్డి వెంటనే మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి అస్థిత్వాన్ని కాపాడటంలో తన వంతు పాత్ర పోసిస్తానన్నారు. త్వరలో చేపట్టబోయే పట్టణ బంద్‌కు అందరు సహకరించాలని సమితి సభ్యులు కోరారు. కార్యక్రమంలో భుషణ వేణి రమేష్‌గౌడ్, బొంకూరి సురేందర్ సన్ని, కావేటి రాజగోపాల్, మంద భాస్కర్, రామగిరి చంద్రమౌళి, పల్లె సదానందం, జాహెద్ హుస్సేన్ కల్లెపల్లి రవి,బొడ్డుపల్లి రామ్మూర్తి, ఆలువాల రాజేందర్, బండ కరుణాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించా లని సెయింట్ మెరిస్ పాఠశాల కరెస్పాండంట్ శౌరెడ్డి అన్నారు. జగిత్యాలలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14 ఖోఖో విభాగంలో కె అఖిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సోమవారం తెలిపారు. సుల్తానాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్- 17 ఖోఖో పోటీల్లో కె మహాలక్ష్మి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైందని, పెద్దపల్లిలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ విభాగంలో జి సిద్ధార్థ డిస్కస్‌త్రోలో మొదటి స్థానం సాధించాడని తెలిపారు. ఎస్.అశ్విత డిస్కస్‌త్రోలో రెండో స్థానం సాధించి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. మున్ముందు రాష్ట్ర, దేశ స్థాయిల్లో పోటీపడి బంగారు పథకాలు సాధించి సుల్తానాబాద్ పేరు నిలపాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శౌరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కె ప్రవీణ్, రాకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కమాన్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమాన్‌పూర్, సిదిద్దపల్లె, ములకలపల్లి, రాజాపూర్, గుండారం, పేరపల్లి గ్రామాల్లో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి, ఏవో రామకృష్ణ, ఆర్ఐ గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, ఏపీఎం శైలజా పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఉపాధ్యాయులకు బీమా సౌకర్యం'

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తన సొంత నిధులతో రూ.2లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పిస్తానని ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం గోదావరిఖనిలో ఓటరు అవగాహన కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రతతో పాటు వారికి ఆరోగ్య కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు.

పర్మినెంట్ ఉద్యోగులకు బోనస్ చెల్లించాలి



దీక్షలో కూర్చున్న బయ్యాపు మనోహర్‌రెడ్డి

పాలకుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో పర్మినెంట్, బేసిక్ ట్రైయినీ ఉద్యోగులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ అధ్యక్షుడు బయ్యాపు మనోహర్‌రెడ్డి సోమవారం రిలే నిరాహర దీక్ష చేపట్టారు. పర్మినెంట్ కార్మికులకు బోనస్ చెల్లించే వరకు దీక్ష కొనసాగుతుందని మనోహర్‌రెడ్డి తెలిపారు. దీక్షకు మద్దతుగా కార్మికులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన అలవెన్స్‌లు ఇప్పిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల నుంచి రికవరీ అయిన అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లు ఇప్పించేందుకు అధికారులతో చర్చిస్తామని ఏఐటీయూసీ ఆర్జీ-2 సెక్రెటరీ జీ రవీందర్ పేర్కొన్నారు. సోమవారం వీకేపీ గని కార్మికులను కలిసి ఆయన మాట్లాడారు. కంపెనీ అవసరాల నిమిత్తం అండర్ గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్‌లో పనులు కేటాయించడం సాధారమమేనని అన్నారు. దానికి గాను అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లు యాజమాన్యం చెల్లింస్తుంటుందన్నారు. కానీ వీకేపీకి చెందిన కొందరు కార్మికులకు అలవెన్స్‌ల కోత విధించిన విషయం తెలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు రవీందర్ తెలిపారు. రికవరీ అయిన అలవెన్స్‌లను ఇప్పించే బాధ్యత ఏఐటీయూసీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

రిటైర్డ్ కార్మికులకు త్వరగా సీఎంపీఎఫ్ చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన సీఎంపీఎఫ్ మొత్తాన్ని వెంటనే చెల్లించేలా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజారత్నం సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్జీ-2 ఏరియాలో గడిచిన నాలుగు నెలల క్రితం దిగిపోయిన కార్మికులకు ఇప్పటి వరకు సీఎంపీఎఫ్, టర్మినల్ బెనిఫిట్స్ చెల్లించలేదని తెలిపారు. సీఎంపీఎఫ్ కోసం రిటైర్ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, ఆఫీస్‌ల చుట్టూ తిరుగూ అవస్థలు పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. యాజమాన్యం సీఎంపీఎఫ్ అధికారులు ఈ విషయంలో వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని రాజారత్నం డిమాండ్ చేశారు.

గనుల జీవితకాలం పెంపునకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల జీవితకాలం పెంపునకు కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతా రామయ్య అన్నారు. ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణను ఆయన సన్మానించి అభినందనలు తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య ఉన్నారు.

ఆర్జీ-1 ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షా సమావేశం

గోదావరిఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలపై కార్పొరేట్ సీజీఎం మనోహర్ సోమవారం జీఎం ఆఫీస్‌లో ఏరియా ముఖ్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నవంబర్ నెలలో ఏరియా సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత అంశాలపై అధికారులతో చర్చించారు. బొగ్గు ఉత్పత్తి మెరుగు పడేందుకు పలు సూచనలు చేశారు. నెలవారీ లక్ష్యాలను సాధిస్తేనే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వార్షిక లక్షాన్ని చేరుకునే అవకాశం ఉంటుందని, ఐదు నెలలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మనోహర్ ఆర్జీ-1 అధికారులకు సూచించారు. ఈసమావేశంలో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, అధికారులు చిలుక శ్రీనివాస్, చంద్రశేఖర్, ఆంజనేయులు, ఆంజనేయ ప్రసాద్, అనిల్‌గబాలే, రమేష్‌కుమార్, అల్లాఉద్దీన్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కార్పొరేట్ సీజీఎం మనోహర్

భూముల పరిహారం చెల్లింపుపై అభిప్రాయ సేకరణ



సుందిల్ల వాసులతో మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-5 ప్రాజెక్టు పరిధిలోని మైనింగ్ లీజ్ భూముల పరిహారం చెల్లింపు సంబంధించి సోమవారం సుందిల్ల రైతులతో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సమావేశమయ్యారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో పరిహారం చెల్లింపు విషయమై గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ లీజ్ భూముల పరిహారం చెల్లింపులో ఏర్పడిన సమస్యల గురించి వివరించారు. చెల్లింపు సజావుగా జరిగేందుకు గాను సింగరేణి, రెవెన్యూ అధికారులతో పాటు గ్రామ పెద్దలతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు జీఎం తెలిపారు.

కమిటీ మైనింగ్ లీజ్ భూములకు సంబంధించిన హక్కుదారులు, అణుభవ దారులతో చర్చించి పరిహారం చెల్లింపులో అడ్డంకులను తొలగించేలా ఒక నిర్ణయం తీసుకుంటుందని జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి, పరిహారం చెల్లింపునకు ప్రతిపాదించుట, చెల్లింపుపై ఒక నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని జీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్జీ-1 అధికారులు చంద్రశేఖర్, కుమారస్వామి, అనిల్‌గబాలె, ప్రభాకర్, సాంబశివరావు, చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ బుచ్చిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న పీవో రాధాకృష్ణకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తూ జీఎం ఎస్టేట్స్‌గా పదోన్నతిపై కార్పొరేట్‌కు వెళ్తున్న రాధాకృష్ణను ఓసీపీ-1 కార్మికులు సోమవారం ఆత్మీయ సన్మానం చేశారు. నాలుగు ఏళ్లు పీవోగా పనిచేసిన రాధాకృష్ణ మూతపడే అవకాశం ఉన్న ఓసీపీ-1 జీవితకాలాన్ని 30 ఏళ్లకు పెరిగేలా కృషి చేసినట్టు కార్మికులు కొనియాడారు. ప్రాజెక్టులో క్లిష్ట పరిస్థితులను అధిగమించి వార్షిక బొగ్గు లక్ష్యాలను సాధించడంలో పీవోగా రాధాకృష్ణ సేవలు అందించారన్నారు. ప్రాజెక్టుకు అవార్డులు, గుర్తింపు రావడంలో ఆయన కృషి ఎంతో ఉన్నట్టు కార్మికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ హరిజన్, అధికారులు శ్రీనివాసరావు, ఉదయ్‌భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతిరావు, గడ్డం తిరుపతి, వెంకటస్వామి, కొలిపాక సారయ్య, ప్రభాకర్‌రెడ్డి, అంబయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని కాసిపేట 2వ గనిమేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం గనిలోని 92మంది బదిలీ వర్కర్‌లకు జనరల్ మజ్దూర్‌లుగా పదోన్నతిపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన కార్మికులందరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏఐటీయూసీ పిట్‌సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధులకు తప్పనిసరిగా హాజరు కావాలి

శ్రీరాంపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఎస్‌ఆర్‌పీ3,3ఏ గని మేనేజర్ సీహెచ్ వెంకట్రావు అన్నారు. 75మస్టర్ల కంటే తక్కువహాజరు ఉన్న కార్మికు లకు సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఒక ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేయాలన్నారు. రక్షణాధికారి మహేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని తొలగించిన సింగరేణి

గోదావరిఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో రోడ్ల విస్తరణలో భాగంగా సోమవారం ప్రధాన చౌరస్తాలో సింగరేణి క్వార్టర్‌లో కొనసాగుతున్న బీఆర్ఎస్ కార్యాలయంతో పాటు నాలుగు దశాబ్దాలుగా ఉన్న హోంగార్డు యూనిట్ కార్యాలయాన్ని సింగరేణి అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఆదేశాల మేరకు పట్టణాభివృద్ధిలో భాగంగా సింగరేణి క్వార్టర్లను తొలగిస్తున్నామన్నారు. దీనికి సహకరిస్తున్న రాజకీయ నాయకులు, క్వార్టర్లలో నివసిస్తున్న ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్వార్టర్ల కూల్చివేతలో నష్టపోయే వారికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.



బీఆర్ఎస్ కార్యాలయాన్ని తొలగిస్తున్న దృశ్యం

హైదరాబాద్‌కు తరలిన మీ సేవ నిర్వాహకులు



హైదరాబాద్‌కు తరలుతున్న మీ సేవ నిర్వాహకులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీ సేవ సమస్యలపై హైదరబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి పెద్దపల్లి మండల మీ సేవ నిర్వాహకులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మీ సేవ నిర్వాహకుల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు మండల అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి నగునూరి శ్రీనివాస్, కన్నం తిరుపతి, నాగుల మల్లేశం, బంక భూమేష్, కుమ్మరి అజయ్, సురేష్, ఖదీర్, రామకృష్ణ, మోబిన్, యాంసాని నవీన్, సొల్లూరి రాజేందర్, మహేందర్, రాజు, స్వామి, గన్నబోయిన సాగర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపులు కలిసికట్టుగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం ద్వారా తమ ఐక్యత చాటి చెప్పినట్లు, ఇదే స్ఫూర్తితో రాష్ట్రమంతా కాపులు కలిసికట్టుగా ఉండాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇమ్మిడిశెట్టి మోహన్ అన్నారు. పెద్దపల్లి మండలం రాగినేడులో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంతో రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపులు ఐక్యతతో కలిసి మెలిసి ఉన్నారని సందేశం ఇచ్చామన్నారు. మున్నూరు కాపుల హక్కులు సాధించుకోవడానికి ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసిన కులబాంధవులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్రం సంజీవ్ పటేల్, జిల్లా అధ్యక్షుడు అనుమాల మహేష్ పటేల్, తొగరి సురేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్ కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్సీ భానుప్రసాదరావు పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్ తల్లిదండ్రులు పల్లా సరోజన-సత్తయ్య దంపతులు ఇటీవల మరణించారు. ఎమ్మెల్సీ వారి నివాసానికి వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లా సురేష్‌తో పాటు సోదరులు రమేష్, మహేష్, శ్రీనివాస్ తదితరులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల రాజమల్లు, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక రాజనర్సు, మాజీ సర్పంచ్‌లు కోడం అజయ్, జూపల్లి రాజేశ్వర్‌రావు, పడాల సతీష్, మాజీ ఎంపీటీసీ ఫకీర్ యాదవ్, సంపత్ తదితరులు ఉన్నారు.

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురహాన్‌మియాపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోడెల శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు ఆయన కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సు, తిరుపతిరెడ్డి, మాడ కొండాల్‌రెడ్డి, ఐలయ్య, సాయిపవన్, గజ్జల తిరుపతి, గుడుగుల మహేందర్, కొత్తిరెడ్డి శరత్‌రెడ్డి, ముత్యల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.